సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 27 । జనవరి । 2023



538 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో 538 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ స్వాధీనం చేసుకున్నారు. - 8లో



వ్యక్తిపై మహిళ కొడవలితో దాడి

కౌలు భూమి వద్ద సాగునీటి కోసం ఓ వ్యక్తిపై మహిళ కొడవలితో దాడి చేసిన సంఘటన వాల్మీకిపురంలో చోటు చేసుకొంది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.90	రూ.158

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 183 మెట్రిక్ టన్నులు



జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు





జాతీయజెండాకు వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పోలీసుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్,ఎస్పీ



దివ్యతేజ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

- భగవంతుని దయ...ప్రభుత్వ సంకల్పంతో జిల్లాలో సంతృప్తిగా వర్షాలు
- అన్నమయ్య ప్రాజెక్టుకు రూ.787 కోట్లు... పింఛాకు రూ. 84 కోట్లు మంజూరు
- 13.18 ఎకరాల్లో రూ. 9.20 కోట్లతో శిల్పారామానికి చర్యలు
- 74వ రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ పీఎస్ గిరీషా

సాక్షి రాయచోటి: భగవంతుడి దయ..రాష్ట్ర ప్రభుత్వ మంచి సంకల్పంతో జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి..వ్యవసాయానికి సంబంధించి అద్భుతమైన వనరులు ఉన్నాయి..పండ్ల తోటలకు జిల్లా ప్రసిద్ధి..కొత్త జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలి వేడుకగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని ప్రణాళికలు రూపొందించాం. ప్రజల సర్వతోముఖాభివృద్ధికి కంకణ బద్ధులమై ఉన్నామని జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా తెలిపారు. 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పోలీసు పెరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ తమీమ్ అన్సారియాలతో కలిసి జాతీయ జెండానుఎగుర వేసి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీసుల పరేడ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రానున్న కాలంలో అన్నమయ్య జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథాన నడిపించనున్నట్లు వెల్లడించారు. ఎందరో అమర వీరులు చేసిన త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. ఈ సందర్భంగా వారందరికి ఘన నివాళులర్పిస్తున్నానని అన్నారు.

- వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా 2022-23కు సంబంధించి 1,98,957 మందికి రూ. 150 కోట్లు, పీఎం కిసాన్ పథకంలో భాగంగా 1,98,513 మందికి రూ. 76 కోట్లు జమ చేశామన్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 2021 ఖరీఫ్‌లో 63 వేల మందికి రూ. 62 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 2021 రబీ, ఖరీఫ్ సీజన్లలో రూ. లక్షలోపు రుణాలు తీసుకున్న 28,489 మందికి రూ. 7కోట్ల వడ్డీ రాయితీ అందించామన్నారు. జిల్లాలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన సమీకృత నీటిపారుదల వ్యవసాయ పరివర్తన, జీవనోపాదుల అభివృద్ధి పథకాల కింద రూ. 27 కోట్లు చేయూతనందించామన్నారు.
- జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇల్లులేని అర్హులైన పేదలందరికీ 2024 సంవత్సరం నాటికి ప్రభుత్వం ఇల్లు నిర్మించి అందించాలని కృత నిశ్చయంతో ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ. 1388 కోట్ల అంచనా వ్యయంతో 525 జగనన్న కాలనీ లే అవుట్లు ఏర్పాటు చేసి మౌలిక వసతులతో 77161 గృహ నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో 11,202 గృహ నిర్మాణాల పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పథకంలో భాగం గా పట్టణాల్లో నివసించే మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ధరలో స్థలాలు కేటాయిస్తున్నామని వివరించారు. జిల్లాలో 414 గ్రామ సచివాలయాలు, 87 వార్డు సచివాలయాల్లో 4421 సచివాలయ సిబ్బంది, 8861 మంది వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. సచివాలయం ద్వారా 540 రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ. 3503 కోట్లపెట్టుబడితో 11 భారీ పరిశ్రమలు స్థాపించగా, అందులో 1136 మందికి ఉపాధి కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే రూ. 976 కోట్ల పెట్టుబడితో 3833 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో 30600 మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు.
- జిల్లా సాధారణ వార్షిక వర్షపాతం 673.8 మి.మీ. కాగా, ఇప్పటివరకు 760.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. 12.9 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. జిల్లాలోని శ్రీనివాసపురం, అడవిపల్లె, వైఎస్సార్ వెలిగల్లు, బహుదా, పెద్దేరు, ఝరికోన ప్రాజెక్టుల్లో సామర్థ్యం మేరకు నీటి నిల్వలు ఉన్నాయి. గతేడాది నవంబరులో కురిసిన భారీ వర్షాలకు మట్టికట్టలు తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టుకు రూ. 787 కోట్లు, పింఛా ప్రాజెక్టుకు రూ. 84 కోట్లు మంజూరు చేసి పరిపాలన అనుమతులు ఇవ్వడంతో త్వరలో టెండర్ల ప్రక్రియ జరగనుంది.
- పర్యాటక వనరులు అన్నమయ్య జిల్లాలో అనేకం ఉన్నాయని తెలిపారు. రాయచోటిలోని వీరభద్ర స్వామి ఆలయ గదుల నిర్మాణాన్ని సుమారు రూ. 9.45 కోట్లతో చేపడుతున్నట్లు వివరించారు.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో 3255 వ్యాధులకు రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో వైద్య సేవలు అనుమతిస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 20,191 మందికి శస్త్ర చికిత్సలకుగాను రూ. 38 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసినట్లు వివరించారు.
- రాయచోటికి సమీపంలో 13.18 ఎకరాల్లో రూ. 9.20 కోట్లతో శిల్పారామం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, త్వరలోనే పనులు మొదలు పెట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. రూ. 50 కోట్లతో రాయచోటి మండలం అబ్బవరం గ్రామం వద్ద 25 ఎకరాల్లో మల్టీ పర్పస్ క్రీడా స్టేడియం నిర్మాణం చేస్తున్నామన్నారు.
- జిల్లాలో వివిధ పథకాల కింద రూ. 367 కోట్ల అంచనా వ్యయంతో 468 కిలోమీటర్లమేర 117 పనులను చేపట్టామన్నారు. రాజంపేట- కదిరి- తుమ్మకూరు నాలుగు లేన్ల రహదారిని రూ.8.50 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేయనున్నట్లు తెలిపారు.అటవీ సమీప గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
- పోలీసు జాగిలాలు జాకీ, జూలీ, మ్యాగీలు చేసిన హార్డిల్‌జంప్ ఆకట్టుకున్నాయి. కలికిరి సైనిక్ పాఠశాల, రాయచోటికి చెందిన గిరిజన సంక్షేమ పాఠశాల, రాయచోటిలోని వీఆర్ టెక్నో , రాయచోటి దివ్యతేజ పాఠశాలల విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను కలెక్టర్ బహూకరించారు. అనంతరం పరిశ్రమల శాఖ ద్వారా జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు ఆధ్వర్యంలో రూ.10.16 కోట్ల విలువైన ఆస్తులను జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో అర్హత కలిగిన పెట్టుబడి రాయితీ రూ.1.74 కోట్లతో మొత్తం ప్రాజెక్టు ఖర్చు రూ.3.87 కోట్ల విలువైన 16 వాహనాలను, స్టాండప్ ఇండియా, పీఎంఈజీపీ పథకాలలో భాగంగా 12 ఎంఎస్ఎంఈలకు రూ.6.29 కోట్ల బ్యాంక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్మన్ షమీమ్ అస్లం, డీఆర్వో సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



పెరేడ్ గ్రౌండ్‌లో మిలటరీ వాహనం



భారతమాత వేషధారణలో విద్యార్థిని



అలరించిన జాగిలం విన్యాసం



కలికిరి సైనికస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

గరుడునిపై ఘనశ్యాముడు



ముత్యపు పందిరి వాహనంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్: మాఢవీధులన్నీ భక్తిభావంతో భజనలు చేస్తున్న భక్తులతో నిండిపోయాయి. ఒకవైపు మంగళ వాయిద్యాల హోరు... మరోవైపు కళాకారుల కోలాటాలు...ప్రతిధ్వనించిన గోవిందనామ స్మరణలు.. మనసారా ఎదురుచూస్తున్న భక్తులను కరుణించేందుకు గజరాజ రక్షకుడు ఘనశ్యాముడు విష్ణుమూర్తి గరుడునిపై కొలువుదీరాడు. దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజు గురువారం ఉదయం శ్రీ రుక్మిణి సత్యభామ సమేతుడైన కాళీయమర్దనుడిగా స్వామిని అలంకరించి ముత్యపు పందిరి వాహనంలో కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామ స్మరణల మధ్య పల్లకీని తిరుమాఢ వీధులలో ఊరేగించారు. భక్తులు పల్లకీ మోసేందుకు పోటీలు పడ్డారు. స్వామి దివ్య తేజోరూపుడై రాత్రి ప్రియ వాహనమైన గరుడినిపై మాఢవీధుల్లో భక్తులను కరుణించాడు. వీధుల్లో ప్రతి ఇంటి వద్ద భక్తులు స్వామికి పూజాద్రవ్యాలు సమర్పించి హారతులు, తీర్థం స్వీకరించారు. తమ ఇంటి ముంగిటకే వచ్చి కరుణిస్తున్న కడప రాయడిని కనులారా తిలకించి పులకించిపోయారు.



గ్రామోత్సవంలో భక్తుల కోలాటం

ఆహ్లాదకర వాతావరణంలో అట్‌హోమ్

రాయచోటి : గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అట్ హోమ్ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఏర్పాటు చేసిన ఈ తేనీటి విందులో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో నూతన అన్నమయ్య జిల్లా అభివృద్ధికి ఐకమత్యంగా కృషి చేద్దామని అధికారులతో అన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులను, మీడియా ప్రతినిధులను పలకరించి అభినందనలు తెలియజేశారు. డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు మద్దిలేటి, బి.సత్యనారాయణ, అగ్నిమాపక శాఖ అధికారి అనిల్‌కుమార్, సమాచారశాఖ డీఐపీఆర్ భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌ఓ సీహెచ్ పురుషోత్తం, సీపీఓ కృష్ణనాయక్, డీఈఓ రాఘవరెడ్డి, డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్, హార్టికల్చర్ ఏడీ రవీంద్రబాబు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, పంచాయతీ రాజ్ ఎస్ఈ సురేష్‌కుమార్, హౌసింగ్ పీడీ శివయ్య తదితరులు హాజరయ్యారు.



అట్‌హోమ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

కడప కేంద్ర కారాగారం నుంచి ఖైదీ విడుదల

కడప అర్బన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా తక్కువ శిక్షపడి 60 శాతం మేరకు శిక్షను అనుభవిస్తున్న ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఇందులో భాగంగా కడప కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ దాసరి వెంకటసుబ్బారెడ్డిని గురువారం గణతంత్ర వేడుకల అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఐఎస్‌హెచ్ ప్రకాష్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల జాబితాలో ముగ్గురి పేర్లను ప్రతిపాదనలకు పంపించామన్నారు. వీరిలో దాసరి వెంకట సుబ్బారెడ్డిని విడుదల చేయాలని ఉత్తర్వులు వచ్చాయన్నారు.

అభివృద్ధిలో మేటిగా రాయచోటి

ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్: అభివృద్ధిలో రాయచోటిని (ఆదర్శంగా) రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం అన్నారు. పట్టణంలోని ఈద్గాకు రూ.18 లక్షలతో నిర్మించిన ప్రహరీగోడ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారికి ఈద్గా కమిటీ నేత బేపారి మహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. ఈసందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సలహాలు,సూచనల మేరకు రాయచోటి నియోజకవర్గంలో ఆలయాలు, మసీదులు,ఈద్గాల అభివృద్ధికి రూ. 80 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. కలికిరిలో సొంత డబ్బులతో ఈద్గా.. మసీదు అభివృద్ధికి, పీలేరు,పుంగనూరులలో షాదీమహల్‌ల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. కోడూరు,రాజంపేటలో ఈద్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. రాయచోటి ఈద్గాలో హజ్‌ఖానా నిర్మాణానికి రూ. 10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ముస్లిం,మైనార్టీల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి ఎంపీ మిథున్‌రెడ్డి రూ.80లక్షలు నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. రాయచోటి ఈద్గాలో వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి కృషిచేస్తోందని శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిల కృషితో రాయచోటి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వ సర్కాజీ షర్ఫుద్దీన్ మాట్లాడుతూ ప్రజలంతా భక్తిమార్గంలో నడవాలని కోరారు.అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్లను పట్టణ మైనారిటీలు సన్మానించారు. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు చిల్లీస్ ఫయాజ్‌బాష, ఫయాజుర్ రహిమాన్,మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు హబీబ్‌ఖాన్, ఆలీనవాజ్‌ఖాన్, హసన్‌బాషా, సలీం, జిన్నా షరీఫ్, ఆసిఫ్ అలీఖాన్, ఫజుల్ ఇలాహి, జమాల్‌ఖాన్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

- రహదారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రూ.16 కోటతో నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి పనులను వారు ప్రారంభించారు.



ఈద్గా ప్రహరీకి సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం తదితరులు

గున్నికుంట్ల రహదారి జాతికి అంకితం

రాయచోటి అర్బన్: అభివృద్ధితో రాయచోటి రూపురేఖలను మారుస్తామని ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. రూ. 4.15 కోట్ల నిధులతో పట్టణంలోని ఎస్‌యన్ కాలనీ నుండి గున్నికుంట్ల రింగురోడ్డుకు అనుసంధానం చేస్తూ నిర్మించిన డబుల్‌రోడ్డును వారు జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, ఏపీఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, తిరుపాల్‌నాయుడు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: రాయచోటిలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో భక్తుల కోసం వసతి సముదాయం నిర్మించడానికి భూమి పూజ నిర్వహించారు. మొత్తం రూ.9.45 కోట్లతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.స్వామి వారి ప్రాశస్త్యాన్ని నలుదిశలా వ్యాపింపచేద్దామని అన్నారు. వీరిని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు పోలం రెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు సన్మానించారు. అంతకుముందు ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లురెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా పరిషత్తు చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్తు చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. 74వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని గురువారం జెడ్పీ ఆవరణంలో వైస్ చైర్మెన్ బాలయ్యయాదవ్‌తో కలిసి జాతీయ జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగినా అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రూ. 2548.84 లక్షలతో జిల్లాలో సీపీడబ్ల్యుఎస్ స్కీమ్‌లకు మరమ్మతులు చేశామన్నారు. అలాగే 303.28 లక్షల జిల్లా పరిషత్తు సాధారణ నిధులతో 105 పనులను అభివృద్ధి చేశామన్నారు. రూ. 337.54 లక్షల ఇసుక వేలం నిధులతో 88 పనులను, రూ. 414.90 లక్షల సీనరేజ్ నిధులతో 128 పనులను, రూ. 33 లక్షలతో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులతో 7 పనులను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, వివిధ సెక్షన్ల ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం సైదాపేటకు చెందిన సద్దాం(60) సొంత పనులపై బి.కొత్తకోటకు వెళ్లాడు. పనులు ముగించుకుని స్థానికంగా కొత్తకోట బెంగళూరు రోడ్డులోని బీసీ కాలనీ వద్దకు కాలినడకన వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడ్ని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్సల అనంతరం చికిత్సల కోసం తిరుపతికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లె : కుటుంబ సభ్యులతో గొడవపడి యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె పంచాయతీ బుచ్చిరెడ్డి గారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు యశ్వంత్‌కుమార్(21) పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో యువతి..

మదనపల్లె : కుటుంబ సమస్యలతో యువతి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సలీమా(22) కుటుంబ సమస్యలతో ఇంట్లో గొడవ పడింది. దీంతో మనస్తాపం చెంది క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారుకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

వేంపల్లె : వేంపల్లె పట్టణంలో వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం మళ్లీ మొదలుపెట్టారు. ఇటీవల కాలంలో నాలుగు మోటార్ బైకులకు, ఒక కారుకు నిప్పు పెట్టడం జరిగింది. పోలీసులు నిఘా పెట్టి ఒక మానసిక రోగిపై అనుమానం వ్యక్తం చేసి అదుపులోకి తీసుకుని మానసిక ఆసుపత్రికి తరలించారు. కొద్ది రోజులు మౌనంగా ఉన్న గుర్తు తెలియని దుండగులు మళ్లీ రంగంలోకి దిగి వాహనాలకు నిప్పు పెట్టడం జరుగుతోంది. వేంపల్లెలోని తిరుమల సినిమా థియేటర్ వద్ద మహమ్మద్ రఫికి చెందిన కొత్త కారుపై గురువారం తెల్లవారుజామున పెట్రోలు పోసి నిప్పు పెడుతుండగా మహిళలు చూసి కేకలు వేశారు. దీంతో దుండగులు పరారైనట్లు ఆ ప్రాంత వాసులు తెలిపారు. తెల్లవారుజామున 5 గంటల సమయం కావడంతో మహిళలు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలను అదుపు చేశారు. వేంపల్లెలో వరుసగా వాహనాలకు నిప్పు పెడుతుండటంతో పోలీసులకు ఛాలెంజీగా మారింది. సీఐ ఇంటి సమీపంలో ఈ ఘటన జరగడం గమనార్హం.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందుకు రాయచోటిలోని పోలీస్ పరేడ్ మైదానం వేదికైంది. జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రగతి శకటాలను ప్రదర్శించాయి. దిశా బృందం, మైన్ ప్రొటెక్టెడ్ వాహనం, వ్యవసాయ, పశుసంవర్ధక, గృహ నిర్మాణ, విద్యా, పంచాయతీరాజ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా), గ్రామీణ నీటి సరఫరా సంస్థ(ఆర్‌డబ్ల్యూఎస్), జిల్లా మహిళా–శిశు అభివృద్ధి(ఐసీడీఎస్ శాఖలు, రాయచోటి పురపాలక సంఘం శకటాలు ప్రదర్శించాయి. – రాయచోటి


వ్యవసాయ శాఖ శకటం


పశుసంవర్ధకశాఖ


విద్యాశాఖ


తాగునీటి సరఫరా- పారిశుధ్య శాఖ


మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ


పోలీసుల కవాతు


అగ్నిమాపకశాఖ సిబ్బంది విన్యాసం

• ఉత్తమ సేవకు ప్రశంస


కలెక్టర్ గిరీషా పీఎస్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జేసీ తమీమ్ అన్సారియా

ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాయచోటి పోలీస్‌పరేడ్ మైదానం ఇందుకు వేదికైంది. జిల్లాలో వివిధ శాఖల్లోని అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాలు అందజేశారు.


డీఆర్‌ఓ సత్యనారాయణ


అడిషనల్ ఎస్పీ రాజ్‌కుమార్


మురళి, ఆర్‌డీఓ, మదనపల్లె


ఆర్‌డీఓ రంగస్వామి


డీఎస్పీ శ్రీనివాసులు


జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి


సెరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి


ఉపాధి పీడీ మద్దిలేటి


జిల్లా వైద్యాధికారి కొండయ్య


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ప్రసన్నకుమార్


విద్యుత్ శాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి


డీపీఓ ధనలక్ష్మీ


డీఐ పురుషోత్తం


డిస్ట్రిక్ కో ఆఫీసర్ ప్రకాశ్‌రావు


రీజనల్ పీఆర్‌ఓ ప్రభాకర్

• సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం

సీనియర్ సిటిజన్స్ గాలివీడు మండలానికి చెందిన షేక్ భానుబీ(93), వీరబల్లి మండలానికి చెందిన డి.లక్ష్మీదేవి(85), పీలేరు మండలానికి చెందిన కె.శ్రీనివాసులురెడ్డి(80)లను కలెక్టర్ గిరీషా సత్కరించారు.


లక్ష్మీదేవి


షేక్ భానుబీ సన్మానిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్


రామాపురం మండలం సుబ్బమ్మ


శ్రీనివాసులరెడ్డి

538 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 538 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం తెల్లవారుజామున ఆర్డీవో ఆకుల వెంకటరమణ స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవోకు వచ్చిన సమాచారం మేరకు స్వయంగా రంగంలోకి దిగిన ఆయన స్థానిక లక్ష్మీపాలెం ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో అక్రమంగా తరలించేందుకు లారీలోకి ఎక్కిస్తున్న 23,350 కిలోల 350 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మార్తోమానగర్‌లోని ఓ ఇంటిలో నిల్వ ఉంచిన 9400 కిలోల 188 బస్తాల రేషన్ బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు దాడుల్లో 32,750 కిలోల 538 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ రాంప్రసాద్‌తో పాటు రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన సురేంద్ర, సునీల్‌లపై అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 170 కేసులు

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా గురువారం స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 170 కేసులను నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ లేని కేసులు 150, సీట్‌బెల్ట్ ధరించని 20 మందిపై కేసులను నమోదు చేసినట్లు ఎస్పీ తెలియజేశారు. హెల్మెట్, సీటుబెల్ట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని కడప ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో గల ఖాజీపేట వద్ద గురువారం కర్ణాటక మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. బి.మఠం మండలానికి చెందిన శివరామకృష్ణ కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో గురువారం తెల్లవారుజామున ఖాజీపేట వద్ద అనుమానాస్పదంగా ఉన్న కారును తనిఖీ చేశారు. అందులో అక్రమంగా తరలిస్తున్న 50 కేసుల కర్ణాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై శివరామకృష్ణ దంపతులను ఎస్పీ కార్యాలయంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇంకా అధికారికంగా వివరాలు తెలియాల్సి ఉంది.

గాయపడిన వ్యక్తి మృతి


మృతుడు నజీర్ అహ్మద్‌ఖాన్

చెన్నూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. చెన్నై–బళ్లారి జాతీయ రహదారిలోని చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పాలెంపల్లె వద్ద సైకిల్‌పై వెళుతున్న పఠాన్ నజీర్ అహ్మద్‌ఖాన్ (47)ను బుధవారం రాత్రి మోటారు సైకిల్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను కడప రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో.. తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో రాజంపేట వద్ద మృతి చెందాడు. కడప నగరం మట్టిపెద్దపులి ప్రాంతానికి చెందిన నజీర్ అహ్మద్‌ఖాన్ పాలెంపల్లె వద్ద రహదారిలో ఉన్న ఐచర్ లారీ వర్క్‌షాప్‌లో మెకానిక్‌గా పని చేసే వాడు. రోజు లాగానే డ్యూటీ ముగించుకుని ఇంటికి వస్తుండగా మోటారు సైకిల్ ఢీకొంది. మృతుడికి భార్యాపిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన సుభాషిణి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శివానగర్‌లో గురువారం రాత్రి పోసిబోయిన సుభాషిణి (31) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శివానగర్‌కు చెందిన సుభాషిణికి 14 ఏళ్ల క్రితం గోపవరం మండలం ఎర్రిచిన్నాయపల్లె గ్రామానికి చెందిన నరసింహులుతో వివాహమైంది. గ్రామంలోనే నివసిస్తున్న వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్న సుభాషిణి పట్టణంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటూ ఉండేది. అయితే గురువారం సాయంత్రం తల్లిదండ్రులు ఓ పని నిమిత్తం బయటికి వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ అధికారులకు జింక పిల్ల అప్పగింత

వేముల : వేములలో శనివారం పొలాల నుంచి జింక పిల్లను కుక్కలు తరుముకుంటూ రావడంతో వేములకు చెందిన బ్రహ్మానందరెడ్డి అనే ఇంట్లోకి వెళ్లింది. దీంతో అతను ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇడుపులపాయలోని అటవీ శాఖ అధికారులకు జింక పిల్లను అప్పగించినట్లు బ్రహ్మానందరెడ్డి తెలిపారు.


ఫారెస్ట్ అధికారులకు జింక పిల్లను అందిస్తున్న బ్రహ్మానందరెడ్డి

వ్యక్తిపై మహిళ కొడవలితో దాడి


చికిత్స పొందుతున్న వెంకటాద్రి నాయుడు

వాల్మీకిపురం : కౌలు భూమి వద్ద సాగునీటి కోసం ఓ వ్యక్తిపై మహిళ కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం వాల్మీకిపురంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వాల్మీకిపురం ఎన్టీఆర్ కాలనీకి చెందిన వెంకటాద్రి నాయుడు అనే రైతు స్థానిక తరిగొండ రోడ్డులో ఎకరా భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అదే ప్రాంతంలో కాలనీకి చెందిన గుణశేఖర్ భార్య రెడ్డిరాణి కూడా కొంత భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తోంది. గురువారం మధ్యాహ్నం కౌలు రైతు వెంకటాద్రి నాయుడు వ్యవసాయానికి నీళ్లు పడుతుండగా.. అవతలి వ్యక్తి రెడ్డిరాణి వచ్చి వాల్వ్ కట్టేసింది. వెంకటాద్రి నాయుడు ఎందుకని అడుగగా.. ఆమె దూషించింది. అంతేకాక కొడవలితో దాడి చేసి ఛాతిపై తీవ్రంగా గాయపరిచింది. బాధితుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఈ మేరకు ఎస్ఐ బిందుమాధవి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

త్రుటిలో తప్పిన ప్రమాదం

సంబేపల్లె : మండల పరిధిలో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న సంఘటన గురువారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. రాయచోటి వైపు నుంచి వస్తున్న కారు మండల పరిధి పి.ఎస్. కాలనీ సమీపంలోని గుండ్రెవారిపల్లె క్రాస్ రోడ్డు వద్దకు రాగానే.. అదుపు తప్పి పక్కనే ఉన్న 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభంతోపాటు తీగలు నేలకు ఒరిగాయి. అప్పటికే విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో కారులో ఉన్న వారికి పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. స్పందించిన విద్యుత్ సిబ్బంది వెంటనే స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేశారు.


కారు ఢీకొనడంతో నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

క్లస్టర్ల విభజనలో రాయలసీమకు అన్యాయం


ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కడప ఆకాశవాణి సిబ్బంది

రాయచోటి : క్లస్టర్ల విభజన పేరుతో కేంద్ర ప్రభుత్వం రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తోందని పలువురు కడప ఆకాశవాణి సిబ్బంది రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం రాయచోటిలోని పోలీసు పపరేడ్ గ్రౌండ్‌లో ఎంపీని పలువురు సిబ్బంది కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం క్లస్టర్లను ఏర్పాటు చేసిందన్నారు. కానీ రాయలసీమ ప్రాంతాన్ని విస్మరించిందన్నారు. వైఎస్సార్ జిల్లా కడపలో 60 ఏళ్ల క్రితం ఆకాశవాణి కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. ఈ కేంద్రాన్ని క్లస్టర్‌గా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. ఎలాంటి అదనపు భారం లేకుండా కడపను క్లస్టర్‌గా ప్రకటించే అవకాశం ఉన్నా రాయలసీమ పరిధిలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలను విజయవాడ క్లస్టర్ పరిధిలోకి చేర్చడం అన్యాయమన్నారు. చారిత్రకంగా, సాంస్కృతికంగా, సాహిత్య, కళా రంగాలలో ఎంతో విశిష్టత కలిగిన రాయలసీమలోని కడప కేంద్రాన్ని క్లస్టర్‌గా ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాగా, కడప కలెక్టరేట్‌లో ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కూడా ఈ మేరకు వినవతిపత్రం అందజేశారు. ఆయన కూడా ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానని తెలిపారు.